ప్రజాశక్తి
ఆదివారం 7 ఏప్రిల్ 2024
8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి

భానుడు భగభగ

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం విలవిల


విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో పెద్దగా కానరాని జన సంచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, కోటవురట్ల విలేకరులు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఎండలు మండుతున్నాయి. శనివారం విశాఖలో భానుడు దంచికొట్టాడు. ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య ప్రధాన కూడళ్లలో జనసంచారం తక్కువుగా కనిపించింది. రామాటాకీస్, మద్దిల పాలెం, ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంతాల్లోనూ పరిమితంగానే జనం కనిపించారు. ఉష్ణోగ్రతల్లో వచ్చిన మార్పుల వల్ల వేడిగాలులు వీచాయి. భీమిలి, పద్మనాభం, ఆనందపురం, గాజువాకల్లో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండల వేడిమితో శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది. జ్యూస్ సెంటర్లు, చెరుకు బండ్లు, కొబ్బరి బొండాల దుకాణాల వద్ద జనతాకిడి పెరిగింది.

అనకాపల్లి జిల్లా కోటవురట్లలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు విలవిలలాడారు. రైతులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, చిరువ్యాపారులు, వృద్ధులు ఆపసోపాలు పడ్డారు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పిహెచ్‌సి వైద్యులు సంతోష్ కుమార్ సూచించారు. బయటకు వెళ్లాల్సి వస్తే క్యాప్ ధరించడం మిగతా 2లో..


కోటవురట్లలో ఎండలోనే ఇళ్లకు వెళ్తున్న విద్యార్థినులు

బిజెపితో పొత్తు పెట్టుకొని..

స్టీల్‌ప్లాంట్‌ని ఎలా రక్షిస్తారు ?

- మ్యానిఫెస్టో పేర టిడిపి మరో మోసం
- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో భాగస్వామిగా చేరి, రానున్న ఎన్నికలకుగాను బిజెపితో పొత్తు పెట్టుకొని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని తెలుగుదేశం విశాఖ పార్లమెంట్ అభ్యర్థి శ్రీభరత్, గాజువాక అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావులు ప్రకటించడమంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లే అవుతుందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అశేష త్యాగాలతో సాధించుకున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర బిజెపి ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని తెలిపారు. ఈ ప్రజా ద్రోహానికి వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ కార్మికులతో పాటు విశాఖ ప్రజలు మూడు సంవత్సరాలుగా పోరాడుతున్నారని పేర్కొన్నారు. ప్లాంట్‌ను అష్టదిగ్బంధనం చేసి నష్టాల్లోకి నెట్టి మోడీ అనుకూల కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలో బిజెపి ప్రభుత్వం ఉందన్నారు. ప్రజలకు ద్రోహం చేస్తున్న బిజెపితో టిడిపి, జనసేన పొత్తు వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్ మరింత ప్రమాదంలో పడిందని తెలిపారు. బిజెపి, టిడిపి, జనసేన కూటమి వల్ల స్టీల్‌ప్లాంట్‌ను రక్షించలేరని, అమ్మకానికే మార్గం సుగమం చేస్తారని అన్నారు. అధికార వైసిపి ప్రభుత్వం కేంద్రాన్ని స్టీల్‌ప్లాంట్ విషయంలో నిలదీయ లేకపోయిందన్నారు. కనుక స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకం నుంచి కాపాడాలంటే బిజెపి, టిడిపి, జనసేన కూటమితో పాటు నిరంకుశ వైసిపిని ఓడించాలన్నారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించడమే స్టీల్‌ప్లాంట్‌కు రక్షణని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌కి తీవ్ర ద్రోహం చేసిన బిజెపి సాయంతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని రక్షించడంతో పాటు విశాఖ రైల్వే జోన్‌ను, విశాఖ మెట్రో రైల్‌ను సాధిస్తామని తెలుగుదేశం మ్యానిఫెస్టోలో ప్రకటించడం అంటే విశాఖ ప్రజలను మరోసారి మోసం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. వారి మోసకారి మ్యానిఫెస్టోలను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంతవరకు బిజెపి ప్రజలను వంచించిందని, ఇప్పుడు టిడిపి, జనసేనలు వంచకులతో జట్టుకట్టి ప్రజలను మోసం చేయ చూస్తున్నాయని తెలిపారు. టిడిపి, జనసేన, వైసిపిలకు ఎవరికి ఓటేసినా అది బిజెపికి ఓటు వేసినట్లేనని ప్రజలు గ్రహించాలన్నారు. ఆ పార్టీలను ఓడిస్తేనే స్టీల్‌ప్లాంట్‌కు, గాజువాకకు, విశాఖకు, యువతకు, కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ మిగతా 2లో..

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

వార్త 2లో..

స్టీల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

వార్త 4లో..

కెకె లైన్‌లో రైల్వే డిఆర్‌ఎం తనిఖీలు

వార్త 2లో..


గడ్డి దిబ్బల్లో దాచిన మద్యం నిల్వలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

భారీగా మద్యం పట్టివేత

రూ.49 లక్షల సరుకు స్వాధీనం

వార్త మెయిన్‌లో..

సమస్యలు పక్కదారి..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'నిజంగా తమకు సంబంధించిన విషయాల నుంచి ప్రజలను పక్కదారి పట్టించే కళే రాజకీయాలు' అని సాల్ వాలెరీ చెప్పిన మాటలు ప్రస్తుత రాజకీయ పరిస్థితులను చూసిన ఎవ్వరికైనా గుర్తుకు రాక మానవు. అలాగే ప్రపంచ ప్రఖ్యాత చైనా విప్లవకారుడైన మావోసేటుంగ్ మాటల్లో చెప్పాలంటే 'రాజకీయాలంటే రక్తపాతం లేని యుద్ధం.. యుద్ధం అంటే రక్తపాతం లేని రాజకీయం' అన్నది ప్రస్తుత రాజకీయాలకు సరిగా అతుకుతుంది. విశాఖలో ప్రధాన పార్టీల అభ్యర్థులకు పై మాటలన్నీ సరిగ్గా అతుకుతాయి. ఈసారి జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో డబ్బు పంపిణీ చుట్టూనే రాజకీయాలు తిరుగుతున్నాయి.

పెరుగుతున్న వ్యక్తుల ప్రాబల్యం

వాస్తవ ప్రజా సమస్యలేవీ ఈ రాజకీయాల్లో తెరపైకి అజెండాగా రాకుండా ప్రధాన పార్టీలు తమ తమ అజెండాలతో ముందుకు వెళ్తున్నాయి. కూటమి తరపున బరిలో నిలిచిన తెలుగుదేశం, జనసేన, బిజెపిలు తమకు రాష్ట్రంలో వేవ్ కనిపిస్తుందని చెబుతూనే రూ.కోట్ల ఖర్చుకు తెగబడుతున్నాయి. రాష్ట్రంలోని అధికార వైసిపి సైతం జగన్ సంక్షేమం, అభివృద్ధి అజెండాయే తమ అభ్యర్థులను గెలిపిస్తుందని చెబుతూనే విశాఖలోని వార్డుల్లో విలువైన బహుమతులను ఓటర్లకు ఎర వేయడం, రూ.లక్షల్లో ఖర్చు చేయడం కనిపిస్తోంది.



ప్రజా సమస్యలకు చోటెక్కడ ?

ఎక్కడ చూసినా రాజకీయాల్లో ఎవరి సొంత అజెండాతో వారు వెళ్తున్నారు. గతంలో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, తూర్పులో పోటీచేసి దక్షిణం జనసేన అభ్యర్థిగా వచ్చిన వంశీకృష్ణ, ఉత్తరంలో వైసిపి అభ్యర్థిగా బరిలో ఉన్న కెకె.రాజు ఈ సారి తమకు కలిసొస్తుందనే ఆశతో ప్రచారం చేస్తూ లబ్ధి పొందాలని చూస్తున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలని కుట్రలు చేస్తున్న బిజెపితో టిడిపి, జనసేన ప్రత్యక్షంగా, వైసిపి పరోక్షంగా పొత్తులు పెట్టుకుని జనాన్ని ఏమార్చుతున్నాయి. ప్లాంట్‌ను అష్టదిగ్బంధం చేసిన బిజెపితో టిడిపి, జనసేన జతకట్టడంపై ప్రజానీకంలో అసంతృప్తి చెలరేగుతోంది.

భారీగా పెరుగుతున్న ఎన్నికల వ్యయం

గతంలో జరిగిన ఏ ఎన్నికలతో పోల్చి చూసినా 2024 ఎన్నికలు అత్యంత ఖరీదైనవిగా మారిపోయాయని చెప్పక తప్పదు. ఎంపీ అభ్యర్థి అయితే రూ.100 కోట్లకు పైగా ఖర్చుపెడతారని, ఎమ్మెల్యే అభ్యర్థి అయితే రూ.30 కోట్లు నుంచి రూ.60 కోట్ల మేర ఖర్చుచేస్తారని తెలుస్తోంది. దీనిపైనా ప్రజల్లో చర్చ జరుగుతోంది. అభ్యర్థులు తమ తమ డిక్లరేషన్‌లు సమర్పించుకునేటప్పుడు లేనిది ఉన్నట్టు.. ఉన్నది లేనట్లు చూపించడం కూడా తెలిసిందే. కార్లు, ఆస్తులు, రూ.కోట్లు లెక్కలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సమస్యలు పక్కదారి..!

చూపించాల్సి వచ్చినప్పుడు అఫిడవిట్లలో అన్నీ తప్పుల తడకలే ఉంటాయి. కానీ క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారాల సందర్భంగా రూ.వందల కోట్లు ఈ ప్రధాన పార్టీలు ఓట్ల కోసం ఖర్చుచేస్తాయన్న సంగతి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. మొత్తంగా చూస్తే పార్టీల అజెండాల్లో ప్రజల వాస్తవ సమస్యలు కానరావడం లేదు. డబ్బు పంచితే సరిపోతుందన్న ఆలోచనలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ని ఎలా రక్షిస్తారు ?

రంగ సంస్థలను ప్రైవేటుపరం కాకుండా కాపాడుకోగలగడం సాధ్యమౌతుందన్నారు. విశాఖ, గాజువాక ప్రజలు చైతన్యపూరిత నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భానుడు భగభగ

మేలన్నారు. నీళ్ల అధికంగా తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు. వృద్ధులు, బాలింతలు, గర్భిణులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఓఆర్‌ఎస్, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మకాయ నీరు వంటివి తీసుకోవాలని సూచించారు.

కెకె లైన్‌లో రైల్వే డిఆర్‌ఎం తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న డిఆర్‌ఎం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శనివారం కొత్తవలస - కిరండూల్ (కెకె) లైన్‌లోని అరకు - కొత్తవలస సెక్షన్‌లో సమగ్ర భద్రతా తనిఖీలు చేపట్టారు. కీలకమైన ఈ రైలు మార్గంలో భద్రత ప్రధానమైనదని ఆయన పేర్కొన్నారు. అరకులోని ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్ డిపో నిర్వహణ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్ ట్రాక్షన్ సబ్-స్టేషన్ నిర్వహణను, కెకె లైన్‌లోని సొరంగాలలో పరిస్థితులను పరిశీలించారు. అనంతరం సిమిలిగుడ - అరకు సెక్షన్ల మధ్య కెకె 22 లెవల్ క్రాసింగ్‌ను పరిశీలించి సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. అక్కడి గేట్‌మ్యాన్‌తో సంభాషించారు. భద్రతా ప్రమాణాలను గుర్తుచేశారు. చివరిగా అరకు రైల్వే స్టేషన్‌లోని రైల్వే హెల్త్ యూనిట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వైద్య సిబ్బందితో మాట్లాడారు.

పలు వార్డుల్లో వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం దక్షిణ నియోజకవర్గంలోని 27వ వార్డు పూర్ణా మార్కెట్, 34వ వార్డులోని పలు ప్రాంతాలలో తన ఎన్నికల ప్రచారం చేశారు. టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు, టిడిపి వార్డు అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, వార్డు జనసేన అధ్యక్షుడు సురేష్ బాబు, బిజెపి నాయకులు కారాల మహేష్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

'విద్యార్థులను హాస్టల్ నుంచి బలవంతంగా ఇంటికి పంపొద్దు'


ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని బిసి కళాశాల హాస్టల్ విద్యార్థులను వారి డిగ్రీ ఆరో సెమిస్టర్ పూర్తికాకముందే కళాశాల హాస్టల్ నుంచి వార్డెన్ పంపించడం తగదని పిడిఎస్‌ఒ విశాఖ జిల్లా అధ్యక్షులు పి.విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం ఎంవిపి.కాలనీలోని బిసి హాస్టల్ వద్ద సంఘం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం బిసి వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.రుద్రి, విశాఖ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.లలిత, సతీష్, ప్రసాద్ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి నియోభారత్ లాటెక్స్ పెయింట్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఏషియన్ పెయింట్స్ కొత్తగా 'నియోభారత్ లాటెక్స్ పెయింట్'ను విడుదల చేసిందని, దీనికి క్రికెట్ ఐకాన్ విరాట్ కోహ్లీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులు అయ్యారని ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ సిఇఒ అమిత్ సింగల్ తెలిపారు. విశాఖలోని ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోభారత్ లాటెక్స్ పెయింట్ వినియోగదారుల అవసరానికి అనుగుణంగా ఉంటుందన్నారు. ఈ పెయింట్ అందమైన ఫినిష్, ఎక్కువ కవరేజ్, మెరుగైన వాషబులిటీ అందిస్తుందని తెలిపారు.

ఎంపీ ఎంవివిని కలిసిన సునీతారెడ్డి

- వైసిపిలో చేరిక



ఎంవివికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సునీతారెడ్డి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న విశాఖ ఎంపి ఎంవివి. సత్యనారాయణను శనివారం లాసన్స్‌బే కాలనీలోగల ఆయన క్యాంపు కార్యాలయంలో నగరంలోని దారపాలెంనకు చెం దిన సునీతారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి ఆయన్ని అభినందించారు. తాను వైసిపిలో చేరుతున్నట్లు సునీత రెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వైసిపి వైపే చూస్తున్నారని ఎంవివి.సత్యనారాయణ ఈ సందర్భంగా మీడియాతో వెల్లడించారు.

అనారోగ్య బాధితులకు పరామర్శ

ఎంవిపి.కాలనీ : వైసిపి తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ శనివారం ఉదయం 18వ వార్డు అప్పుఘర్, ముప్పలవానిపాలెం ప్రాంతాల్లో పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మారుపిళ్లి సత్తయ్య, సత్యనారాయణ, పుక్కల దానయ్య, గరికిన ఎల్లాజీ, మారుపిళ్లి సత్తయ్య, టి.లక్ష్మి, వాసుపల్లి భీమారావు, ఐ.లక్ష్మి ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. బాధ పడొద్దని, అండగా ఉంటామని కుటుంబీకులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచంద్ర, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కొనసాగిన పాదయాత్ర

నియోజకవర్గంలో ఎంవివి పాదయాత్ర శనివారానికి 83వ రోజుకు చేరుకుంది. 17వ వార్డు ఎంవిపి.కాలనీ, సెక్టార్ 8లో ఆయన పర్యటించారు. ఆయన వెంట వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, నాగరాజు ఉన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

అగ్ని ప్రమాద మత్స్యకారులను పరామర్శించిన ఎమ్మెల్యే వాసుపల్లి



క్షతగాత్రులను పరామర్శిస్తున్న వాసుపల్లి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సముద్రంలో బోటులో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడి కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మత్స్యకారులను శనివారం దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పరామర్శించారు. ప్రమాద పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యంతో పాటు, వారి కుటుంబ సభ్యులకు వసతి, నాణ్యమైన భోజనం తానే అందిస్తానని అన్నారు. అధైర్య పడకుండా ఉండాలని, ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ప్రమాదం జరిగిన వారిలో 50 శాతం కాలిన వారు క్షేమంగా ఉన్నప్పటికీ, 80 శాతం కాలిన వారి పరిస్థితి క్రిటికల్‌గా ఉందని డాక్టర్లు తెలిపారన్నారు. ఆయన వెంట వైసిపి దక్షిణ ఎన్నికల పరిశీలకులు శ్రీ వాత్సవ్, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, మత్స్యకార నాయకులు పులి రాజు పాల్గొన్నారు.

37వ వార్డులో ప్రచారం

దక్షిణ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ 37వ వార్డు పరిధి బీచ్ రోడ్డు, కొత్త అగ్రహారం కాలనీ నుంచి ప్రచారం ప్రారంభించారు. రెల్లి సామాజిక తరగతి అండతో మరోసారి తాను గెలుపొందడం తథ్యమని అన్నారు. భజన కోవెల, ఆసిపావీధి, రెల్లి వీధి, జబ్బర్ తోట, పెయిన్ దొర పేట, గాంధీ బొమ్మ ప్రాంతాల్లో ఆయన ప్రచారం సాగింది. ఆయన వెంట వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, దక్షిణ ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, వార్డు నాయకులు ధన, గనగళ్ల రామరాజు, డేవిడ్ రాజు, కోసరపు వాసు, అశోక్, ఏసు, వెంకటలక్ష్మి, పులిరాజు ఉన్నారు.



గంటాను కలిసిన కూటమి నేతలు

గంటా ఇంటి వద్ద సందడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : మాజీ మంత్రి, భీమునిపట్నం టిడిపి అభ్యర్థి గంటా శ్రీనివాసరావును ఎంవిపి.కాలనీలోగల అతని నివాసం వద్ద శనివారం పలువురు కలిశారు. అతని ఇంటి వద్ద అభిమానుల తాకిడి కనిపించింది. మధురవాడ నుంచి పలువురు జనసేనకు చెందిన అభిమానులు గంటాను అభినందించేందుకు విచ్చేశారు. ఈ నెల 10 నుంచి తాను ఎన్నికల ప్రచారాన్ని భీమునిపట్నం నియోజకవర్గంలో ప్రారంభిస్తానని ఈ సందర్భంగా మీడియాకు గంటా తెలిపారు.

వైర్ రాడ్ మిల్-2 ఉద్యోగులకు ప్రోత్సాహకాలివ్వాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వైర్‌రాడ్ మిల్- 2ను స్థాపించిన అచిర కాలంలోనే వార్షిక ఉత్పత్తి 6 లక్షల టన్నుల రికార్డ్ స్థాయి ఉత్పత్తి సాధించిందని, కార్మికులకు ప్రోత్సాహకాలను ఇవ్వాలని సిఐటియు నాయకులు కోరారు. ప్లాంట్‌లో నూతన వేతన ఒప్పందం ఇంకా అమలు కానప్పటికీ, ప్రొడక్షన్ ఇన్సెంటివ్‌ను భారీగా తగ్గించినప్పటికీ, ఇతర ఆర్థిక ప్రయోజనాలు నిలిపి వేసినప్పటికీ ప్లాంట్ మీద మమకారంతో, బాధ్యతతో, ఆకుంఠిత దీక్షతో, రేయింబవళ్లు కార్మికులు కష్టపడి పనిచేసి రికార్డ్ స్థాయిలో ఉత్పత్తి సాధించిన సందర్భంగా డబ్ల్యుఆర్ఎం-2 ఉద్యోగులందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించాలని సిఐటియు ఆధ్వర్యాన సిజిఎం (వర్క్స్) అజయ్‌కుమార్ సోబితి, సిజిఎం (మిల్స్) శ్రీనివాస్ ప్రసాద్, డిజిఎం (ప్లాంట్ హెచ్ ఆర్) చక్రవర్తి, వైర్ రాడ్ మిల్- 2 విభాగాధిపతి కెవి.దినకర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, డబ్ల్యుఆర్ఎం-2 కార్యదర్శి సిహెచ్.అరుణ్, అధ్యక్షులు ఆర్.రామ్మోహన్, త్రిఫ్ట్ డైరెక్టర్ కర్రి శ్రీనివాస్, ఎస్.సంతోష్‌కుమార్, టి.శ్రీనివాసులు, వి.వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

వైసిపిలో చేరిన యువనేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 5వ వార్డుకు చెందిన మన్యాల హనుమంత్ వైసిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో శనివారం వైసిపిలో చేరారు. వైసిపి కండువా వేసి పార్టీలోకి ముత్తంశెట్టి ఆహ్వానించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పరిపాలన నచ్చి వైసిపిలో చేరినట్లు తెలిపారు. వైసిపిలో చేరిన హనుమంత్ మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు అన్నయ్య కుమారుడు అని ముత్తంశెట్టి క్యాంప్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

బిఎస్‌పి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని రేఖవానిపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న పలు ప్రాంతాల్లో శనివారం బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థి భాగం గోపాలరావు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజక వర్గంలో ఉన్న ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తూ ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

60 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పద్మనాభం, రెడ్డిపల్లి, మద్ది గ్రామాలకు చెందిన 60 మంది వాలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపిడిఒకు అందజేశారు.

ఘనంగా నూకాలమ్మ పండగ

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం పాలెం ఆర్‌హెచ్.కాలనీ సమీపంలో నూకాంబిక అమ్మవారి ఆలయంలో నూకాలమ్మ పండుగ జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వైసిపి ఆరో వార్డు జనరల్ సెక్రటరీ, అనూష కేటరింగ్ అధినేత పోతిన ప్రసాద్ కుటుంబ సభ్యులు ఆధ్వర్యాన లక్ష్మివానిపాలెం, ఆర్‌హెచ్.కాలనీ ప్రజలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా పోతిన ప్రసాద్ మాట్లాడుతూ, ఈ ఉత్సవాలు ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఘనంగా జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతిన రాము, వాండ్రాసి వెంకట అప్పారావు, నగరాల కార్పోరేషన్ మాజీ చైర్మన్ పిల్లా సుజాత, సత్యనారాయణ, పోతిన చంటి, కమిటీ ప్రెసిడెంట్ కెఎన్‌పి.చక్రవర్తి, సెక్రెటరీ పి.బాలసుందరరావు పాల్గొన్నారు.

వైవి.సుబ్బారెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారిగా విశాఖకు విచ్చేసిన వైవి.సుబ్బారెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గజమాలతో ఆయనను సత్కరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

విజయం.. సునాయాసం : గంటా


సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం సునాయాసం అని టిడిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గస్థాయి క్లస్టర్, యూనిట్ ఇంఛార్జిలతో శనివారం సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి ఆర్‌ఎస్‌డిపి అప్పలనరసింహరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, పనితనానికి గీటురాయి ప్రతి బూత్‌లో టిడిపికి మెజారిటీ రావడమేనని స్పష్టం చేశారు. తొలి నుంచీ పార్టీ కోసం పనిచేసే వారికి ప్రాధాన్యత ఉంటుందని, ఇందులో ఎటువంటి అపోహలకు తావులేదన్నారు. 2014లో నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధి కళ్ల ముందు కనబడుతుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు, కార్పొరేటర్లు గాడు చిన్నికుమారిలక్ష్మి, మొల్లి హేమలత, నాయకులు పాసి నరసింగరావు, గంటా నూకరాజు, కాళ్ల నగేష్‌కుమార్, కె.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక జాతరలో 'గంటా'

ప్రజాశక్తి- పిఎం.పాలెం : జివిఎంసి 6వ వార్డు పరిధి సేవానగర్ జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ సమీపంలోని నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవంలో భీమిలి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు శనివారం పాల్గొన్నారు. కాలనీ ప్రజలు, వార్డు టిడిపి నాయకులు ఆయనకు పెద్ద ఎత్తున హారతులిచ్చి స్వాగతం పలికారు. నూకాంబికా అమ్మవారిని గంటా శ్రీనివాసరావు దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం గంటా శ్రీనివాసరావు మాట్లడుతూ, భీమిలి నియోజకవర్గంలో టిడిపి ఎన్‌డిఎ బలపరిచిన అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలవడమే లక్ష్యమన్నారు. గెలిచిన తర్వాత భీమిలి నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడతానని చెప్పారు. అమ్మవారి ఆశీసులతో ప్రచారం మొదలుపెట్టానన్నారు. ఈ కార్యక్రమంలో గంటా తనయుడు గంటా రవితేజ, విజ్డిస్ ఫౌండేషన్ చైర్మన్ తలశిల విజయ్‌మోహన్, టిడిపి నాయకులు జీవన్, శ్రావణ్, గారె గురునాథ్, దాసరి శ్రీనివాస్, రెడ్డి సత్యనారాయణ, కొల్లి గోవిందరావు, లొడగల జానకిరామ్, గొలగని సన్యాసిరావు, కొరగంజి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 2న ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ఎస్‌విఎల్ఎన్ఎస్‌జిడిసి-2024 పేరిట నిర్వహించిన ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో చిట్టి లెవెన్ జట్టు, కృష్ణ లెవెన్ జట్టు తలపడ్డాయని, ఒక పరుగు తేడాతో చిట్టి లెవెన్ జట్టు విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన జట్టు కెప్టెన్‌కు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి ట్రోఫీ అందజేశారు. క్రీడాకారులను అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.గౌరీశంకర్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకుంటున్న క్రికెట్ జట్టు విజేతలు

వంశపారపర్యంగా కంటి వ్యాధులు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సచ్ దేవా

ప్రజాశక్తి - ఆరిలోవ : వంశపాంపర్యంగా కూడా పుట్టబోయే చిన్నారులకు కంటి వ్యాధులు సంభవించవచ్చని

డాక్టర్ వీరేందర్ సచ్‌దేవా

ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వీరేందర్ సచ్ దేవా పేర్కొన్నారు. ఎల్‌వి ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ జిఎంఆర్ వరలక్ష్మి క్యాంపస్ సమావేశ మందిరంలో వంశపాంపర్యంగా వచ్చే కంటి వ్యాధులపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సాధారణ కంటి వ్యాధులు, వాటి పర్యవసనాలు, జీవనశైలిలో మార్పులు, వ్యాధుల నివారణ తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరేందర్ సచ్‌దేవా మాట్లాడుతూ, గతంలో ఎల్‌వి.ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ జరిపిన అధ్యయనంలో రక్త సంబంధీకులు మధ్య వివాహాలు వల్ల కళ్లపై ప్రభావాల గురించి కొన్ని ఆసక్తికర నిజాలు వెల్లడైనట్లు తెలిపారు. ఇటువంటి కంటి వ్యాధులను ముందుగా గుర్తిస్తే చికిత్స ద్వారా నియత్రంచవచ్చని తెలిపారు.

నేరాలు ఘోరాలు

జీడి, టేకు తోటలు దగ్ధం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జోగుంపేట హైస్కూల్ సమీపంలో బుంగ రామకృష్ణకు చెందిన రెండు ఎకరాల జీడితోట, టేకు తోట దగ్ధమైంది. దీంతో బాధితుడు తీవ్రంగా విలపించాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

ఐఎన్‌టిఎస్‌ఒలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పిఎం పాలెం : మధురవాడ బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఐఎన్‌టిఎస్‌ఒ ఒలింపియాడ్‌లో సత్తా చాటారు. ప్రైమరీ, హైస్కూల్ కలిపి మొత్తం 289 మంది విద్యార్థులు ఉత్తీర్ణతను సాధించారు. శ్రీ చైతన్య పాఠశాలల రీజినల్ ఇన్చార్జ్ అహ్మద్ అలీ చేతుల మీదుగా గ్రాండ్ ప్రైజ్ లాప్‌టాప్‌ను నాలుగో తరగతి చదువుతున్న తన్విష్ సాయి అందుకున్నాడు. మొదటి బహుమతి ట్యాబ్‌ను ఏడో తరగతి చదువుతున్న డి.వైష్ణవి, రెండవ బహుమతిగా స్మార్ట్ వాచ్‌ను ఆరో తరగతి విద్యార్థి జై.ప్రీత్ అందుకున్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ మెరిట్ సర్టిఫికెట్స్, మెడల్స్ అందించారు. పాఠశాల ప్రిన్సిపల్ సందీప్ మాట్లాడుతూ, శ్రీ చైతన్య విద్యాసంస్థలు విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్ది, వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తాయని చెప్పారు. విద్యార్థులకు ఉత్తరాంధ్ర, కాకినాడ జోన్ ఎజిఎం సురేష్, రీజినల్ ఇన్చార్జ్ అహ్మద్ అలీ, ప్రైమరీ ఇన్చార్జ్ శైలజ, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరరావు, డీన్ ఢిల్లేశ్వరరావు, సి-బ్యాచ్ ఇన్చార్జ్ సాయి, ప్రైమరీ ఇన్చార్జ్ దుర్గ, ఒలింపియాడ్ ఇన్చార్జ్‌లు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.


పాండ్రంగిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాగమణి

పాండ్రంగిలో నాగమణి ప్రజా పరిశీలన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామంలో భీమిలి అసెంబ్లీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న నాగోతి నాగమణి శనివారం ప్రజా పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి మహిళలతో మాట్లాడారు. సమస్యలనడిగి తెలుసుకున్నారు. పాండ్రంగి గ్రామంలో అల్లూరి వారసులు లేకపోయినప్పటికీ ఆ రాజవంశం ఉందని ఆమె తెలిపారు. వారు నివాసం ఉంటున్న గ్రామాల్లో ఇన్ని సమస్యలు ఉండటం సిగ్గుచేటన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, వీధుల్లో మంచినీటి కుళాయిలు, కాలువలు లేకపోవడం బాధాకరమన్నారు. ఇటువంటి గ్రామాల్లో సులబ్ కాంప్లెక్స్‌లను ఏర్పాటుచేయాలని కోరారు. ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా తనకు ఒక్క అవకాశం ఇస్తే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఎన్ఎస్ఆర్ఐటిలో రక్తదానం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాంలో గల నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్ క్లబ్, విశాఖపట్నం ఆధ్వర్యాన శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ విశాఖపట్నం కో-ఆర్డినేటర్ సుధాకరరావు సమక్షంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 83 యూనిట్ల బ్లడ్‌ను విద్యార్థులు, సిబ్బంది దానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్ మాట్లాడుతూ, రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ డాక్టర్ జె.రాజమురుగదాస్, ఎన్ఎస్ఎస్ పిఒ హరగోపాల్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఓటర్ లిస్టులో అవకతవకలు'

ప్రజాశక్తి-పెందుర్తి : ఓటర్ లిస్టులో అవకతవకలు ఉన్నాయని టిడిపి జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు ఆరోపించారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఒకు పంచకర్ల రమేష్‌బాబు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఒకే డోర్ నెంబర్ మీద 15 నుంచి 20 ఓట్లు ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గ మొత్తంమీద సుమారు 8000 దాకా ఇటువంటి దొంగ ఓట్లు ఉన్నాయని, వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆర్‌ఒను కోరారు. దొంగ ఓట్లతో గెలవాలని వైసిపి ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు.

స్టీల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు, మిత్రపక్షాల ఆధ్వర్యాన ప్రధాన పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ, యాజమాన్యాలకు వ్యతిరేకంగా కార్మికులు పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ, కార్మికులకు జీతాలు చెల్లించడంలో యాజమాన్యం కావాలనే జాప్యం చేస్తోందని విమర్శించారు. రూ.2500 కోట్ల అమ్మకాలు జరిగినా కనీసం రూ.80 కోట్ల జీతాలు చెల్లించలేని పరిస్థితిలో యాజమాన్యం లేదని, ప్రభుత్వ ఆదేశాలతోనే కార్మికులకు జీతాలు చెల్లించడంలో జాప్యం చేస్తోందని పేర్కొన్నారు. కార్మికులు కనీస అవసరాలను తీర్చుకోలేని స్థితికి తీసుకొచ్చి వారిని మానసికంగా, ఆర్థికంగా అణచివేయాలనే దుర్మార్గపు ఆలోచనలను తక్షణం విరమించుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే యాజమాన్యం తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, మిత్రపక్షాల ప్రతినిధులు డివి.రమణారెడ్డి, డి.సురేష్‌బాబు, సిఎస్.సన్యాసిరావు మాట్లాడుతూ, యాజమాన్యం క్రమశిక్షణ పేరుతో కార్మికులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోందన్నారు. కార్మిక హక్కులను కాపాడాల్సిన గుర్తింపు యూనియన్ నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. యాజమాన్యంతో గుర్తింపు యూనియన్ సమన్వయ లోపం వల్లే నేడు కార్మికులకు జీతాలు అందలేదన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న యాజమాన్య వైఖరిని గుర్తింపు యూనియన్ సమర్థిస్తోందన్నారు. దీనివల్ల కార్మికుల్లో అసంతృప్తి పెరిగి కర్మాగారంలో ఉత్పత్తి ఉత్పాదకతలపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో స్టీల్ సిఐటియు ప్రతినిధులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కెఎం.శ్రీనివాస్, పి.భానుమూర్తి, శ్రీనివాస్, రమణమూర్తి, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.


ఉక్కు ప్రధాన పరిపాలనా భవనం వద్ద ధర్నా చేస్తున్న సిఐటియు, మిత్రపక్షాల నాయకులు


కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న కెకె.రాజు

'ఉత్తరం'లో కెకె.రాజు ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార రైతుబజార్ సమీపంలోని ఆక్సిజన్ టవర్స్‌లో ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, కార్పొరేటర్లు సాడిపద్మారెడ్డి ,కె.అనిల్‌కుమార్‌రాజు, కిరణ్‌రాజు, ఆళ్ల శివగణేష్, అంబటి శైలేష్, గుడ్ల అశోక్‌రెడ్డి, సతీష్‌వర్మ, రాంబాబు, దేవరాజ్‌రెడ్డి, బోణి అప్పారావు, శ్రీనివాస్, రాజు, జిఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల సందర్శన

నూకాంబిక అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలోని పలు ఆలయాలను కెకె.రాజు సందర్శించారు. అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 48, 49 వార్డుల పరిధి బర్మాక్యాంపు, జైభారత్‌నగర్ నూకాంబిక ఆలయం వద్ద జైభారత్ నగర్ అధ్యక్షులు బొగ్గు శ్రీను ఆధ్వర్యాన జరిగిన మహోత్సవంలో, 48వ వార్డు పరిధి ఇందిరానగర్-2 నూకాంబిక ఆలయం వద్ద మహోత్సవంలో పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, వార్డు ఇంచార్జ్ నీలిరవి, నాయకులు రాజన్న గంగరాజు, అనురాధ, కరి రామారెడ్డి, వసంతల అప్పారావు, కె.శ్రీను, పద్మ, అప్పారావు, కల్యాణ్ శ్రీను, హేమంత్, కనక మహేష్, భరత్, శంకర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్‌కు స్పందన

ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న మార్నింగ్ వాక్‌కు విశేష స్పందన వస్తోంది. ఆయా వార్డుల్లో స్థానిక ప్రజలు ఆయనకు సాధరంగా స్వాగతం పలుకుతున్నారు. 42వ వార్డు పరిధి అక్కయపాలెం దాలిరాజ్ సూపర్ మార్కెట్ ఎదురుగా మూడు గుడుల లైన్‌లో కెకె.రాజు, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, శ్రీనివాస్‌తో శనివారం మార్నింగ్ వాక్ నిర్వహించారు. స్థానిక సమస్యల గురించి ప్రజలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బులుసు జగదీష్, రాయుడు శ్రీను, సకల బత్తుల ప్రసాద్, నూకరాజు, నాగమణి, బి.గోవింద్, అంబటి శైలేష్, గంగ మహేష్, రేవతిరావు, పి.రవి, బొట్టారాజు, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, సబ్బి నూకరాజు, వెంకటేష్, చిన్న తదితరులు పాల్గొన్నారు.



పట్టాలు అందుకున్న విద్యార్థులు

బివిఎన్ స్కూల్ స్నాతకోత్సవం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక చెట్టివానిపాలెంలో ఉన్న భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యార్థులకు (యుకెజి) స్కూల్ ఆవరణలో శనివారం స్నాతకోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గాజువాక మండల విద్యాశాఖాధికారి ఎమ్.సునీత హాజరై చిన్నారులకు పట్టాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, విద్యతోపాటు క్రమశిక్షణ అవసరమన్నారు. పూర్వ ప్రాథమిక విద్యార్థులు పట్ల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ చదువులో రాణించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పి.రమాదేవి, జిప్సా కార్యదర్శి బి.శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ఎమ్.సత్యనారాయణ, చంద్రకళ, గౌతమి, రాణి, సునీత, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు


టి.నగరపాలెంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపిస్తాయని వైసిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలంలోని తాటితూరు, టి.నగరపాలెం గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పలు ప్రచార సభల్లో ఆయన మాట్లాడుతూ, అత్యంత పారదర్శకంగా వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేసినట్లు వివరించారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీ ఏంటన్నది చూడకుండా ప్రతి ఇంటికీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచులు సిరిగిడి సంతోషి, పొట్నూరు చాయా గౌతమి, ఎంపిటిసి సభ్యులు ఉండభట్ల ఆదిలక్ష్మి, పల్లా నీలిమ, ఎంపిపి దంతులూరి వాసురాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డి.పెదబాబు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను, పార్టీ నాయకులు చంద్రశేఖర్, సన్యాసిరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.


సర్టిఫికెట్ అందజేస్తున్న పద్మపూజిత వీల్స్ మార్ట్ అధినేత బసవరాజు

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి-సీతమ్మధార : రక్తదానం చేయడం ద్వారా మరొక ప్రాణాన్ని కాపాడుకోవచ్చని పద్మ పూజిత వీల్స్ మార్ట్ చైర్మన్ బసవరాజు అన్నారు. దొండపర్తిలోని సంస్థ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏటా సంస్థ ఆధ్వర్యాన మెగా రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పద్మ పూజిత వీల్స్ మార్ట్ సంస్థల్లో 10 సెంటర్లలో ఈ మెగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. మొత్తంగా 570 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారికి సహాయపడుతుందనే ఉద్దేశంతో ఏటా ఈ రక్తదాన శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సాయిబాబు, శ్రీనివాసరావు, వేణునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి దుర్మార్గ పాలన నుంచి విముక్తే లక్ష్యం : పల్లా

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి ప్రభుత్వ దుర్మార్గ పాలన నుంచి ప్రజలను విముక్తి చేయడమే తమ లక్ష్యమని గాజువాక నియోజకవర్గం టిడిపి కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. బిసి రోడ్డులోని సత్తెమ్మ తల్లి గుడిలో ముందుగా పూజలు చేశారు. అనంతరం జివిఎంసి 65వ వార్డు టిడిపి ఆధ్వర్యాన బానోజీ కాలనీ, కాకతీలోవలో ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల జగన్మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. బాబు సూపర్ -6 పథకాల ద్వారా ప్రజలకు మెరుగైన సంక్షేమ కార్యక్రమాలు అందిస్తామని తెలిపారు. భవన నిర్మాణదారుల నుంచి వైసిపి కార్పొరేటర్లు వసూలుచేస్తున్న అక్రమ వసూళ్లు, భూ దందాలపై సమగ్రమైన విచారణ జరిపించి కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో తెలుగుదేశం, బిజెపి జనసేన ప్రభంజనాన్ని జగన్మోహన్‌రెడ్డి అడ్డుకోలేరన్నారు. గాజువాక నియోజకవర్గ ప్రజలు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలను మర్చిపోలేన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించడం నా జీవితాశయం అన్నారు. గాజువాక నియోజవర్గాన్ని మోడల్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గాజువాక జనసేన ఇన్‌ఛార్జి కోన తాతారావు, వార్డు టిడిపి అధ్యక్షులు రత్తి వాసు, వార్డు జనసేన ఇన్‌ఛార్జి రొయ్య రత్నం, టిడిపి ఇన్‌ఛార్జి బైపల్లి గాంధీ, జనసేన నాయకులు గడసాల అప్పారావు, గంధం వెంకట్రావు, కరణం కనకారావు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు


చలివేంద్రం ప్రారంభంలో శశికళ, వరప్రసాద్

55వ వార్డులో చలివేంద్రం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 55వ వార్డులో ఆర్.వరప్రసాద్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ శశికళ ప్రారంభించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ, ఎండలు తీవ్రత ఉండటంతో తన వంతు సహాయంగా ప్రజలకు మేలు చేసేందుకు చలివేంద్రం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎల్.పట్నాయక్, గంగమహేష్, సురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన జనసేన కార్యకర్తలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 79వ వార్డు సోషల్ మీడియా కన్వీనర్ మామిడి సోమనాయుడు ఆధ్వర్యాన 200 మంది జనసేన నాయకులు, కార్యకర్తలు వైసిపిలో చేరారు. గాజువాక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ వారికి వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపి విధానాలు నచ్చి తాము పార్టీలో చేరామని జనసేన నాయకులు, కార్యకర్తలు చెప్పారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, పార్టీ విజయానికి మీరంతా శ్రమించాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం యువకులకు ఎంతో మేలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బలిరెడ్డి నాగేశ్వరరావు, గొల్లవిల్లి సురేష్, వాడపల్లి రామచంద్రరాజు, నర్సింగరావు, తమ్మిన చైతన్య, సాయి, సురేష్, శివ, పి.సాయి, ప్రశాంత్, రేవంత్, గణేష్, పండు, చక్రి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


సమ్మెకు మద్దతు తెలిపిన సిఐటియు

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల గ్రామపంచాయతీలో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు డిమాండ్ చేశారు. తుమ్మపాల పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న విషయం విధితమే. రెండు నెలల జీతం బకాయి చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేస్తున్న ఈ సమ్మెకు ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, (సిఐటియు) ఈ మేరకు శనివారం కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ గ్రామపంచాయతీలో టెండర్ విధానం రద్దు చేసి డైరెక్ట్‌గా పంచాయితీ కార్మికులకు జీతాలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ వర్తింపజేయాలని హైకోర్టు చెప్పినా ఎక్కడా అమలు చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే టెండర్ విధానం రద్దు చేయాలని, జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని, కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ వర్తింపజేయాలని, బూట్లు, తువాళ్లు, సబ్బులు, యూనిఫామ్, కొబ్బరినూనె వంటివి కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్ కుమార్, దుర్గారావు, బాలు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



పంచాయితీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు



సీర శ్రీనివాస్‌కు పార్టీ కండువా వేస్తున్న విజయ్‌కుమార్

జనసేనలో చేరిన శ్రీనివాస్

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని వెదురువాడ పంచాయతీకి చెందిన నాయకుడు సీర శ్రీనివాస్ శనివారం జనసేన పార్టీలో చేరారు. శ్రీనివాస్‌కు జనసేన యలమంచిలి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికలలో విజయ్‌కుమార్ గెలుపునకు పనిచేస్తానని ఈ సందర్భంగా శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల శాఖ అధ్యక్షుడు బయలపూడి రాందాసు, ఎంపిటిసి సభ్యుడు రాజాన బాషా, ఆడారి కృష్ణ, ద్వారపురెడ్డి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులు జనసేనలో చేరిక

అనకాపల్లి : జీవీఎంసీ 81వ వార్డు (పాత 16వ వార్డు) పతివాడ భాస్కరరావు మిత్రమండలి ప్రతినిధి పతివాడ భాస్కరరావు ఆధ్వర్యంలో 50 మంది వైసిపి నాయకులు జనసేన పార్టీలో శనివారం చేరారు. కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నూకాంబిక పండగకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ఎం.అలమండ గ్రామంలో ఈ నెల 7, 8 తేదీల్లో నూకంబిక అమ్మవారి పండగను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ దాడి జగన్, ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈనెల 8న నూకాంబిక మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక యూత్ ఆర్థిక సాయంతో నిర్వహించే ఈ పోటీల్లో మొదట బహుమతి పావుతులం బంగారం, తర్వాత స్థానాల్లో వరుసగా రూ.16 వేలు, రూ.13 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4వేలు, రూ.3 వేలు, రూ.2వేలు, రూ.1500 చొప్పున బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటోలపై ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అనకాపల్లి పార్లమెంట్, యలమంచిలి శాసనసభ స్థానాల నుండి వివిధ పార్టీల తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపునకు విస్తృతంగా ఆటోలపై ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి యువి.రమణమూర్తిరాజు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు ఫొటోలతో కటౌట్లను ఆటోలకు మూడు వైపులా తగిలించి మైక్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు. బిజెపి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేష్ గుర్తు కమలంకు, జనసేన నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుందరపు విజయ్ కుమార్ ఎన్నికల గుర్తు గాజు గ్లాసుపై ఓటు వేసి గెలిపించాలని మైక్‌లో ప్రచారం చేస్తున్నారు. ఆటోలకు మూడు వైపులా డిజిటల్ కటౌట్లు తగిలించారు. ఎస్ఈజెడ్ కాలనీ, పూడిమడక తదితర గ్రామాల్లో ఈ ప్రచారం సాగింది.

కొత్త అమావాస్య జాతరకు

నూకాంబిక దేవస్థానం సిద్ధం



ఏర్పాట్లును పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ సుజాత, ఇఒ ప్రసాద్

ప్రజాశక్తి -అనకాపల్లి

ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర కొత్త అమావాస్య, ఉగాదికు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7 నుండి వచ్చేనెల 8 వరకు నెలరోజుల పాటు అమ్మవారి అమ్మవారు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని తెలిపారు. కొత్త అమావాస్య జాతరకు ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలియజేశారు. క్యూలైన్లు, చలువ పందిళ్ల ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో క్యూ లైన్లో ఉండే భక్తులకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, చిన్నపిల్లలకు పాలు సరఫరా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎటువంటి సంఘటన జరగకుండా పోలీస్ శాఖ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మెడికల్, ఫైర్ ,జీవీఎంసీ, విద్యుత్, శాఖ అధికారులు కూడా తగిన ఏర్పాటు చేస్తున్నారని తెలియజేశారు. ఈనెల 26న అమ్మవారు మూలవిరాట్ దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన

నూకంబిక అమ్మవారి దేవస్థానం వద్ద ఈనెల 7 తేదీ ఆదివారం రాత్రిజాతర, 8వ తేదీ కొత్త అమావాస్య, 9వ తేదీ ఉగాది పండగల నేపథ్యంలో శనివారం దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, పండగ ప్రత్యేక అధికారి సుజాత, ఈవో బండారు ప్రసాద్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. ప్రసాదాలు, ఆలయం ప్రాంగణమంతా పరిశీలించి ఆలయ ఈవో బండారుప్రసాద్‌కు పలు సూచనలు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్యూలైన్లను, చలువ పందిళ్లను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మురళి తదితరులు పాల్గొన్నారు.



పంచాయితీ కార్యదర్శికి రాజీనామా పత్రం అందిస్తున్న మాధవి

గ్రామ వాలంటీర్ మాధవి రాజీనామా

ప్రజాశక్తి -కశింకోట

మండలంలోని జెట్టపురెడ్డి తుని గ్రామ సచివాలయం పరిధిలో పని చేస్తున్న గ్రామ వాలంటీరు కొండా మాధవి శనివారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గ్రామ కార్యదర్శి మేరీ జోన్స్‌కి అందించారు. ఎవరి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.

వారాహి యాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -అనకాపల్లి

జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఈ నెల 7న అనకాపల్లి రింగ్ రోడ్డు జంక్షన్ వద్దకు నిర్వహించు వారాహి యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం పాత మున్సిపాలిటీ 23వ వార్డులో ఆ వార్డు అధ్యక్షులు బొడ్డేడ మురళి, జివిఎంసి 80వ వార్డు అధ్యక్షులు బిఎన్ఎంకె జోగి నాయుడు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుద్ధ ఈశ్వరరావు, మళ్ల శ్రీను, కోరిబిల్లి పరి, సూరిశెట్టి నాగు, కాండ్రేగుల రాజు, మళ్ల ఉషా సాగర్, మద్దాల నాగ శివ, యల్లపు సత్యనారాయణ, పీలా హరి, పెంటకోట రమణ, చదరం సంతోష్ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న జనసేన, టిడిపి నాయకులు

నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు చర్యలు


కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్‌పి మురళీకృష్ణ



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్‌పి మురళీకృష్ణ, ఇతర అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

పారదర్శకత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు కలెక్టర్ రవి పటాన్ శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ వెల్లడించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడారు. అంతకుముందు ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చేపడుతున్న చర్యలను, నిర్వహిస్తున్న విధులను రాష్ట్ర సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, ఎస్‌పిలను అడిగి తెలుసుకుని తగు సూచనలిచ్చారు. జిల్లాలో ఇంతవరకు ఫార్మ్ డిస్పోసల్, ఎంసిఎంసి రిపోర్ట్స్, ఎంసిసి వయొలేషన్, గ్రీవెన్స్ కమిటీ, సీజర్ మేనేజ్మెంట్, పోలింగ్ పర్సనల్ రాండమైజేషన్ తదితర కార్యక్రమాల వివరాలను, తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. జిల్లాలో చెక్ పోస్ట్ నిర్వహణ, తీసుకుంటున్న చర్యలు గూర్చి, ఎన్నికల దృష్ట్యా చేపడుతున్న పోలీస్ బందోబస్తు వివరాలను ఎస్పి మురళీకృష్ణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పి విజయబాస్కర్, డిఆర్ఓ బి.దయానిధి, ఎస్‌డిసి సుబ్బలక్ష్మి, డిఎస్ఓ కెవిఎల్ఎన్ మూర్తి, డిఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, సిపివో జి.రామారావు, మత్స్యశాఖ ఎడి ప్రసాదు, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ, ఎన్నికల విభాగ పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వివిధ విభాగాల నోడల్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోక్‌సత్తా నేత భీశెట్టి బాబ్జి

ప్రభుత్వ వైఫల్యంతోనే 33 మంది పింఛనుదారుల మృతి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా వైఫల్యమే రాష్ట్రంలో 33 మంది పింఛనుదారుల మృతికి కారణమని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఆరోపించారు. శనివారం అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను పక్కతోవ పట్టించిన సీఎస్ జవహర్ రెడ్డి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అనుకూలంగా వ్యవహరించి పింఛనుదారులను కావాలనే నాలుగైదు కిలోమీటర్లు నడిపించారనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో 15 వేల సచివాలయాలు ఉంటే 66 లక్షల మంది పింఛను దారులు ఉన్నారని, వాలంటీర్ల అవసరం లేకుండా 1,34,694 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కేవలం రెండు రోజుల్లోనే ఇంటింటికీ తిరిగి పింఛన్లు అందించవచ్చని పేర్కొన్నారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రత బయట ఉంటే వృద్ధులు ఎలా సచివాలయానికి వెళ్లగలరని, ఆమాత్రం ఆలోచన లేని పరిస్థితిలో రాష్ట్ర సీఎస్ జవహర్ రెడ్డి ఉన్నారా అని ప్రశ్నించారు. పింఛన్లు అందించే సచివాలయం వద్ద షామియాన, తాగునీటి ఏర్పాట్లు కూడా చెయ్యలేదన్నారు. వచ్చే మే నెల ఒకటి, రెండు తేదీల నాటికైనా సీఎస్ పింఛన్‌దారుల ఇంటికి పింఛన్లు అందించే ఏర్పాట్లు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కొలసాని రమణ, ఆయకట్టు రైతుల ప్రతినిధి పెంటకోట వరప్రసాద్, సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న కూండ్రపు శేషు

రామాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మాణం తలపెట్టిన రామాలయం నిర్మాణానికి హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు, ఆయన భార్య శ్రావణి, కుమార్తె వైష్ణవి పేర్లతో రూ.10,016 విరాళం ఆలయ కమిటీ ప్రతినిధులకు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిల్లాడి తాతబ్బాయి, ఉపసర్పంచ్ శ్రీరామ మహాలక్ష్మి నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దారాలమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి-సీలేరు

ఆదివాసీల దేవత దారాలమ్మ అమ్మవారి 58వ వార్షిక మహోత్సవం శనివారం ఉదయం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవారి ఆలయంలో కలుస్థాపన చేశారు. కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారు ప్రధాన పండుగ కొత్తఅమావాస్య రోజు వైభవంగా జరపడానికి దేవాదాయ శాఖ ఈవో సాంబశివరావు అన్ని చర్యలు చేపడుతున్నారు. ఆంధ్ర, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ప్రధాన పండుగ రోజు తరలివస్తారు. అందుకు అనుగుణంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

దేవాదాయ శాఖ ఉద్యోగుల ప్రమోషన్లపై సమగ్ర విచారణ జరపాలి

ఆ శాఖ జిల్లా అధికారికి డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖలో ఈ మధ్య కాలంలో ఇచ్చిన ప్రమోషన్లపై సమగ్ర విచారణ జరపాలని, అంబేద్కర్ కోనసీమ జిల్లాకు అక్రమంగా ప్రమోషన్ పొందిన ఐనవిల్లి ఈవో సత్యనారాయణ రాజును సస్పెండ్ చేయాలని అనకాపల్లి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అధికారికి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సీహెచ్.శివాజీ, జిల్లా కమిటీ సభ్యులు పి.చలపతి శనివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖలో అక్రమ ప్రమోషన్ల వ్యవహారంపై ఒక కమిటీ వేసి నిజానిజాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. సీనియారిటీ లిస్టు ఖాతర్ చేయకుండా జీవో 888ను అమలు చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా ప్రమోషన్లు ఇచ్చారని విమర్శించారు. అర్ధరాత్రి ప్రమోషన్లపై సమగ్ర విచారణ జరపాలని, అంతవరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి ఈవో సత్యనారాయణరాజును సంబంధించిన అధికారులు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు స్వయంగా సత్యనారాయణరాజు ప్రమోషన్ అక్రమమని తేల్చిన తర్వాత కొనసాగించడంలో ఆంతర్యం ఏమిటిని ప్రశ్నించారు. సత్యనారాయణరాజును విచారిస్తే అక్రమ ప్రమోషన్ల విషయంలో నిజానిజాలు బయటికొస్తాయన్నారు. అక్రమ ప్రమోషన్ల వ్యవహారంలో సీనియారిటీ ఉన్న ఉద్యోగులకు, దశాబ్ద కాలంగా పనిచేస్తున్న చిన్న ఉద్యోగులకు నష్టం కలుగుతుందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే అయినవిల్లి ఇవో సత్యనారాయణ రాజు అక్రమ ఆస్తులపై ఈడి అధికారులు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై సమగ్ర విచారణ చేసి సీనియర్ ఉద్యోగులకు, కింది స్థాయి ఉద్యోగులకు న్యాయం చేయకుంటే పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.



జిల్లా దేవాలయ శాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న డివైఎఫ్ఐ నేతలు

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం



కాఫీ విత్ కేడర్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఏమాత్రం జరగలేదని టిడిపి, జనసేన, బిజెపి కూటమి అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఆరోపించారు. అనకాపల్లి మండలంలో కెఎస్ఆర్ పేటలో శనివారం ఉదయం జరిగిన కాఫీ విత్ కేడర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజశేఖర్ రెడ్డి తనయుడు జగన్ రాజశేఖర్ రెడ్డి లాగ మంచి పరిపాలన అందిస్తాడనే ఉద్దేశంతో ఒక ఛాన్స్ ఇచ్చారన్నారు. ఒక ఛాన్స్ అని తల్లిని చెల్లిని వాడుకొని పదవుల్లోకి వచ్చిన తర్వాత వారిని బయటకు నెట్టారన్నారు. సొంత బాబాయిని చంపించి దుర్మార్గపు రాజకీయాలు చేశాడని విమర్శించారు. మద్యం, గంజాయి, ఇసుక, మైనింగ్ భూకబ్జాలు మీద ఉన్న శ్రద్ధ అభివృద్ధి మీద పెట్టి ఉండుంటే నేడు మన రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ముందుగా మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. టిడిపి నాయకులు మాధంశెట్టి నీలబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, ఆయా పార్టీల నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, చూచుకొండ రమణ, జాజిమొగ్గల అప్పలరాజు, యర్రా వెంకట సత్యనారాయణ, సిరిసిపల్లి ప్రసాద్, చేబోలు దుర్గాప్రసాద్, యాతా గోపీ, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నాగజగదీష్

చంద్రబాబు ప్రకటనపై నాగజగదీష్ హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ ఏప్రిల్ నెల నుండి నాలుగు వేల రూపాయలు పింఛను ఇస్తామని తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించడం పట్ల టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం ఏప్రిల్, మే, జూన్ మాసాల రూ.3వేలు జూలై మాసంతో కలిసి ఒకేసారి రూ.7వేలు జూలై నెలలో పెన్షన్ దారులకు అందజేస్తారని తెలిపారు. వాలంటీర్లను తమ పార్టీ కార్యకర్తలుగా ఏనాడో ప్రకటించారని, వారికి ప్రజల సొమ్ము ధారాదత్తం చేస్తూ, ఎన్నికల్లో ప్రచారానికి వాడుకోవడానికి చూశారని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, సీఎం రమేష్‌లను గెలిపించాలని కోరారు. విలేకరుల సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, బీసీ నాయకులు కర్రి గోపి, గుడాల సత్యనారాయణ, బోడి వెంకటరావు, భర్నికాన శ్రీనివాసరావు, మళ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి కొరత లేకుండా చర్యలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో అప్పలరాజు తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడారు. ఏ గ్రామంలో మంచినీటి బోర్లు పనిచేయకపోయినా ఫిర్యాదు అందిన 24 గంటల్లో మరమ్మత్తులు చేయడం జరుగుతుందని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా మొబైల్ బోర్ మెకానిక్ టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న అన్ని సబ్ సెంటర్లలోనూ సిహెచ్‌సిలోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. వడదెబ్బ తీవ్రతకు గురికాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రొంగలి సూర్యనారాయణ, అన్ని శాఖల అధికారులు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, ఎంపిడిఒ, సభ్యులు

ముమ్మరంగా వరి నూర్పులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని పలు గ్రామాల్లో ముమ్మరంగా వరినూర్పులు సాగుతున్నాయి. కొద్ది రోజులుగా దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం, సీతయ్యపేట, పెదపూడి తదితర గ్రామాల్లో రబీ సీజన్‌లో పండిన వరి పనలను యంత్రాలతో నూర్పులు చేస్తున్నారు. గతంలో పశువులతో తొక్కించి, తరువాత ట్రాక్టర్లతో తొక్కించి వరి నూర్పులు చేసేవారు. అయితే వ్యవసాయంలో యాంత్రీకరణ బాగా పెరిగిన తరువాత ఇప్పుడు వరి నూర్పులు యంత్రాలతో చేస్తున్నారు. వరి పనలను యంత్రాలలో వేసి నూర్పుతున్నారు. ధాన్యం గడ్డి వేరువేరుగా వస్తుండడంతో రైతులు ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నారు. పలువురు రైతులు అద్దె ప్రాతిపదికన యంత్రాలతో నూర్పులు చేస్తున్నారు.

సింహాద్రి అప్పన్నకు ఘనంగా పూజలు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీలో వియ్యపు వారి సేవగరిడి వారి అధ్వర్యంలో శ్రీసింహాద్రి అప్పన్న ప్రార్థనా కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో పరవాడ మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా పాల్గొని సింహాద్రి అప్పన్నకు ప్రత్యేక పూజలు చేశారు. వెంకటాపురం, గాజువాక నక్కవానిపాలెం, బొట్టవానిపాలెం, వాడ్రాపల్లి, దేవాడ తదితర గ్రామాల వారి తాడు పెద్దులు సేవగరిడీలు నిర్వహించారు. గొల్లపేట తప్పుడు గుళ్ళు, కోలాటం ఆటకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వియ్యపు అప్పలరాజు, ఉరుకూటి అప్పలనర్సింహం, వియ్యపు అప్పల రాజు, సారిపల్లి నేస్తాలు, వియ్యపు ముత్యాలు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



తాడుపెద్దుతో వియ్యపు చిన్న తదితరులు

పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని

ఆదివాసీ గిరిజన సంఘం నిరసన

ప్రజాశక్తి-కొత్తకోట:తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి జెడ్.జోగంపేటలో సబ్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ శివారు అజయ్ పురం గ్రామ ఆదివాసీలు డిమాండ్ చేశారు. శనివారం గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు, మండల శాఖ కార్యదర్శి చంద్రయ్య మాట్లాడుతూ, రోడ్డు సౌకర్యం లేని అజెయపురంలో తాగు నీటి సదుపాయం లేదన్నారు. ట్యాంకు నిర్మాణం సకాలంలో పూర్తి కాక తాగు నీటి ఎద్దడి నెల కొందన్నారు. ఓటు వేయాలంటే 14 కిలోమీటర్లు దూరంలో ఉన్న చీమల పాడు వెళ్లాలని, గ్రామానికి మూడు కిలోమీటర్లు దగ్గరలో ఉన్న జడ్.జోగంపేట మండల ప్రాథమిక పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఎన్నికల సంఘం నిబంధన ప్రకారంగా. సబ్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చీమలపాడు పంచాయతీలో 19 గ్రామాలు ఉండగా అందులో ఎనిమిది సూదూర గ్రామాలలో సుమారు 800 ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. వీరంతా ఒకే చోటు చీమల పాడు పోలింగ్ కేంద్రంలో ఓట్లు వేయడానికి రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేరేడు బంధ గ్రామం నుంచి గుర్రాల పై వచ్చి ఓటు వేయాల్సిన దుస్థితి ఉందన్నారు. తక్షణమే జెడ్.జోగంపేటలో సబ్ పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ఎన్నికల సంఘం చర్యలు చేప ట్టాలని గోవిందరావు, చంద్రయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు వంతల విజయ కుమార్, పలువురు గిరిజన ఓటర్లు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నేతలు, గిరిజనులు



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నేతలు

అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:పాకరావుపేట నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, అనకాపల్లి పార్లమెంట్ ఎంపీ ముత్యాల నాయుడు గెలుపునకు పార్టీ శ్రేణులు కష్టించి పనిచేయాలని వైసీపీ నేతలు కోరారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో శనివారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహామూర్తి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, ఎలమంచిలి తాతబాబు, నాయకులు లోడగల చందర్రావు, సూరకాసుల గోవింద్, గొర్ల బాబురావు, నాగేష్ మాట్లాడారు.



క్యూలో ఉన్న భక్తులు

వెంకన్న ఆలయం కిటకిట

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. శనివారం కావడంతో సుధూరు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జాబ్‌కార్డులను అందజేస్తాం

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్: సాంకేతిక కారణాలతో డిలీట్ అయిన జాబ్ కార్డులు, ఉన్న జాబు కార్డులో యాడింగులను గుర్తించి వారందరికీ ఉన్నతాధికారుల అనుమతితో జాబు కార్డులు అందజేస్తామని రావికమతం మండల ఎపిఓ కాశి తెలిపారు. ప్రజాశక్తి పత్రికలో శనివారం ప్రచురితమైన వార్తకు స్పందించిన ఎపిఓ మాట్లాడుతూ, ఇప్పటికే మండలంలో అన్ని గ్రామాలలోనూ ఉపాధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. జాబు కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి పని కల్పించడం, వేతన కూలీకి రోజుకు 300 రూపాయలు వచ్చే విధంగా పని కల్పించడం జరుగుతుందని తెలిపారు. మండలంలో జాబు కార్డు లేకుండా ఉన్న వారందరినీ గుర్తించి కొత్త కార్డులు ఇప్పించడంతో పాటు వంద రోజులు పని కూడా కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి జనసేన కార్యాలయంలో శనివారం వైసిపి నాయకులు కల్యాణి ఆధ్వర్యాన 95వ వార్డుకు చెందిన సుమారు 25 కుటుంబాలు జనసేనలో చేరారు. వారికి కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం రమేష్‌బాబు మీడియాతో మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి పాలన మీద అందరూ అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రం ఏ విధంగా కూడా అభివృద్ధి చెందలేదన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధిలో నడుస్తుందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలన వల్ల రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. జగన్మోహన్‌రెడ్డిని సాగపంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గల్లా శ్రీనివాసరావు, రోమాళ్ల శ్రీను, అయిత సింహాచలం, మధు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గణేష్‌కు నోటీసులు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:ఎన్నికల కోడ్ ఉల్లంఘటపై నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు నోటీసులు జారీ చేశారు. నర్సీపట్నం మున్సిపాలిటీలోని వెంకునాయుడుపేటలో ఇటీవల వాలంటీర్లతో సమావేశం నిర్వహించిన నేపథ్యంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌కు నోటీసు జారీ చేసినట్లు నర్సీపట్నం నియోజవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డిఓ జయరాం తెలిపారు. ఈ సమావేశానికి హాజరయ్యారంటూ దాఖలైన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే గణేష్ నుండి సంజాయిషీ కోరుతూ ఈ నోటీస్ అందించామని తెలిపారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సమావేశంలో పాల్గొన్న వాలంటీర్లు, సంబంధిత ఇంటి యజమాని, మరో నలుగురు వైసిపి మద్దతుదారులపై ఇప్పటికే కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. వాలంటీర్ తో సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే గణేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ మంత్రి నర్సీపట్నం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారని చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్ సూచనలతో ఎమ్మెల్యేకు నోటీసు జారీ చేశామన్నారు



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఓటు హక్కుపై కళాజాతా

ప్రజాశక్తి -చీడికాడ:నిజమైన నీతి పరిపాలన అందించే నాయకుడిని ఎన్నుకోవాలంటే ఓటే వజ్రా యుదుమని కళాజాతా కళాకారులు వివరించారు. మండల కేంద్రంలో డప్పు కళాకారులు ఓటు హక్కు విలువను జానపద పాటలతో వివరించారు. డబ్బు మధ్యానికి బానిసలు కాకుండా నీతి నిజాయితీగా మంచి నాయకుడిని ఎన్నుకుంటే రాష్ట్ర, దేశ భవిష్యతుక్త బంగారు బాటలు పడతాయన్నారు. అందుకేనే ప్రతి ఒక్కరు ఓటునే ఆయుధంగా మలుచుకొని నిస్వార్ధంగా ఓటు వేసి సమర్థవంత నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. ఓటు పై ఎటువంటి సందేహాలు న్నా 1950 హెల్ప్ లైన్ సెంటర్‌కు కాల్ చేయవచ్చు నన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీరామమూర్తి, సిసి, సిఏలు రాము వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పైలా ప్రసాదరావు పర్యటన

ప్రజాశక్తి - మాడుగుల : మండలంలోని కింతలి, కింతలి వల్లాపురం, పోంగలిపాక, అవురువాడ, జాలంపల్లి, జమ్మాదేవిపేట పంచాయతీల్లో మాడుగుల ఎన్డీఏ అసెంబ్లీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు శనివారం పర్యటించారు. కూటమి అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేస్తామని కార్యకర్తలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద రావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అద్దిపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఒడ్డి రాజకుమార్, మండల బిజెపి అధ్యక్షుడు ఉండూరు రాజు, వైస్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు.



పైలా ప్రసాదరావును సన్మానిస్తున్న నాకులు



పింఛను ఇస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

కెజిహెచ్‌కు వెళ్లి పింఛను పంపిణీ

ప్రజాశక్తి-కోటవురట్ల:పాములవాక సచివాలయ పరిధిలోని మోయ్యి నాగమణి సికిసెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతుంది.ఆమెకు ప్రతినెల పది వేల రూపాయలు పించను ప్రభుత్వం ఇస్తుంది. ప్రస్తుతం ఆమె గర్భిణీ కావడంతో డెలివరీ నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్ లో చికిత్స పొందుతుంది. శనివారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్ కేజీహెచ్ కు వెళ్లి పింఛను అందజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిఐ విజయ్ కుమార్ సూచించారు. మండలంలోని పెదదొడ్డిగల్లు గ్రామంలో శనివారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల అనేక మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత డేటాను గోప్యంగా ఉంచాలని, తెలియని వ్యక్తులు అడిగితే వివరాలు తెలపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలలో ఉన్నందున, ఎన్నికల నియామవళిని పాటించాలన్నారు. కోడు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సిఐ విజయ్‌కుమార్

విద్యార్థులకు విశ్రాంత ఉద్యోగి ఉపకార వేతనాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం జియో ఫిజిక్స్ విభాగం విద్యార్థులకు ఓఎన్‌జిసి విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్.చంద్రబాబు ఉపకార వేతనాలను అందించడానికి ముందుకొచ్చారు. విభాగంలో విద్యార్థులకు శనివారం రూ.16 వేలు ఉపకార వేతనాలుగా అందించారు. ప్రతి నెలా విభాగంలో అవసరమైన విద్యార్థులకు రూ.3 వేలు ఉపకార వేతనంగా అందించడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఏయూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉపకార వేతనాలను అందించడానికి వచ్చిన విశ్రాంత అధికారి చంద్రబాబును ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ప్రతిభ కలిగి, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఇటువంటి సహాయం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సివి.నాయుడు, విభాగ ఆచార్యులు పి.త్రినాధరావు, ఎం.జగన్నాధరావు, ఆచార్య జి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎంజె.ప్రకాష్, ఆనంద్ తదిరతులు పాల్గొన్నారు.

అనంతగిరిలో భారీ వర్షం

-ఘాట్ రోడ్డుపై విరిగిపడిన భారీ వృక్షం

-పిడుగుపాటుకు దుక్కిటెద్దులు మృతి-బాధిత రైతులను ఆదుకోవాలి : సిపిఎం



పిడుగుపడి మృతి చెందిన పశువులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో శనివారం ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. పిడుగుపాటుకు గురై మూడు దుక్కిటెద్దులు మృతి చెందాయి. అనంతగిరి ఘాట్ రోడ్డులో అరుకు ప్రధాన రహదారిపై వృక్షం కూలి పోయింది. మండలంలోని టోకురు పంచాయతీ పరిధి రాయివలస గ్రామానికి చెందిన కొర్రా రామన్న, చంపి సన్యాసి, గుజ్జెల మొంగుడలకు పశువులు పిడుగుపడి మృతి చెందాయి. గ్రామానికి సమీపంలో ఉన్న పొదలలో మేత కోసం పశువులు వెళ్లాయి. ఆ సమయంలో ఆకాశమంతా ఒక్కసారిగా మేఘా మృతమై ఉరుములు, మెరుపులు భారీ వానం కురిసింది. దీంతో పశువులు చింత చెట్టు వద్దకు చేరాయి. ఒక్కసారిగా పిడుగు పడటంతో మూడు పశువులు మతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న టోకురు సిపిఎం సర్పంచ్ కిల్లో మొస్య స్థానిక గిరిజనులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, బాధిత గిరిజన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఒక్కొక్క దుక్క పశువు ఖరీదు రూ.30 వేల నుండి 50 వేల ఉంటుందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారానికి రైతులకు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల సీనియర్ నాయకులు జి. దేవన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రోడుడపై విరిగిన వృక్షం

బోటు ప్రమాద మత్స్యకారులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: సముద్రంలో, చేపల వేటకు వెళ్లి, బోటులో అగ్ని ప్రమాదానికి గురై గాయపడిన మత్స్యకారులను ప్రభుత్వం అన్ని రకాల ఆర్థికంగా ఆదుకోవాలని, ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందుకోవాలని ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన కెజిహెచ్ లో చికిత్స పొందుతున్న మత్స్యకారులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదంలో గాయపడిన మత్స్యకారులు చికిత్స పొందుతున్న వారు పూర్తిగా కోలుకునే వరకు ఒక్కొక్క కుటుంబానికి రూ. 50 వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అన్నారు. ప్రమాదంలో బోటు నష్టపోయిన కాకినాడకు చెందిన బోటు యజమానికి రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సముద్రంలో మత్స్యకారులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరిగినప్పుడు బయటి పడటానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.



జ్యోతిప్రజ్వలన చేసి జాబ్ మేళాను ప్రారంభిస్తున్న అతిథులు

విసిసిఐ జాబ్ మేళాకు స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: వైజాగ్ పటం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (విసిసిఐ) యువజన విభాగం అద్వర్యంలో శనివారం ఉదయం ఎంవిపి కాలనీ లోని గాదిరాజు ప్యాలెస్లో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా విసిసిఐ యూత్ వింగ్ ప్రెసిడెంట్ దివ్య అభిలాష్ ప్రారంభించారు. ఈ జాబ్ ఫెయిర్‌కు నగరంలోని వివిధ కళాశాలల నుండి 3000 కి పైగా పాల్గొన్నారు. 40కి పైగా కంపెనీలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో విసిసిఐ అధ్యక్షుడు ఎం. సుదర్శన్ స్వామి, గౌరవ కార్యదర్శి రోలాండ్ విలియమ్స్, మాజీ అధ్యక్షులు మల్లిక్ కంకటాల, వీర మోహన్, వైస్ ప్రెసిడెంట్ రోహిత్ కంచర్ల, మహిళా విభాగం అధ్యక్షురాలు జీజా వల్సరాజ్, విసిసిఐ సభ్యులు మహిళా విభాగం సభ్యులతో పాటు విసిసిఐ యూత్ వింగ్ సభ్యులు పాల్గొన్నారు.



వెంకటస్వామిని అభినందిస్తున్న వీసీ

బూసి వెంకటస్వామికి అభినందనలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగ ఆచార్యులు బూసి వెంకటస్వామి (మద్రాస్ విశ్వవిద్యాలయ ఉగాది పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా) ఆంధ్ర విశ్వకళాపరిషత్ వైస్ ఛాన్సలర్ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అభినందనలు తెలియజేసారు.ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ,బూసి వెంకటస్వామి తెలుగు భాషా, సాహిత్యానికి చేస్తున్న సేవకు ప్రతిఫలంగా మద్రాస్ విశ్వవిద్యాలయం ఉగాది పురస్కారం అందుకోవడం అభినందనీయమని ,భవిష్యత్తులో వారు మరిన్ని అవార్డులు అందుకొని తెలుగు విభాగానికి,విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య యం.జేమ్స్ స్టీవెన్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి, సానిటరీ, బ్యూటిఫికేషన్ డిపార్ట్ మెంట్ డీన్ గోవాడ వీర్రాజు పాల్గొన్నారు.

మూకుమ్మడిగా గ్రామ వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం దొండపూడి సచివాలయం పరిధిలో ఉన్న గ్రామ వాలంటీర్లు శనివారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను మండలం అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ, పేదలకు సేవలు చేయాలన్న సంకల్పంతో వాలంటీర్లు గా విధులు నిర్వహించామని పేర్కొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని సీఎం, చోడవరం ఎమ్మెల్యే గా కరణం ధర్మశ్రీని గెలిపించుటకు తమ వంతు ప్రయత్నం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అందులో భాగంగానే వాలంటీర్లు అందరూ తమ విధుల నుంచి తప్పు కున్నట్టు పిచ్చేటి మణి రాజు, జి చిరంజీవిరావు, ఎం.సతీష్, మహేష్ తెలిపారు.

గొలుగొండ: మండలంలో పలు సచివాలయాలు పరిధిలో పని చేస్తున్న సుమారు 120 మంది వాలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు మండలంలో ఏఎల్ పురం, కృష్ణదేవిపేట, చోద్యం, కొత్తమల్లంపేట, జోగుంపేట, పప్పుశెట్టిపాలెం, కొమిర, పాతమల్లంపేట పంచాయతీలకు చెందిన వాలంటీర్లు శనివారం ఆయా పంచాయతీ కార్యదర్శులకు రాజీనామాలను సమర్పించారు. ఎన్డీఏ కూటమి నాయకులు తాము ఏ పని చేసినా విమర్శనాత్మక ధోరణిలో చూస్తున్నారన్నారు. దీంతో మనస్థాపన చెంది రాజీనామాలు సమర్పిస్తున్నామని వాలంటీర్లు తెలిపారు.



పిడుగుపడి మృతి చెందిన పశువులు

యోగాలో లక్ష్మికి గోల్డ్ మెడల్


ప్రజాశక్తి -గాజువాక : నేపాల్‌లో సమైక్య భారతీయ కేల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఈ నెల ఒకటి నుంచి 5వ తేదీ వరకు సకార ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన పోటీల్లో ప్రముఖ న్యాయవాది లక్ష్మికి యోగాలో బంగారు పతకం లభించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ బిఎఫ్ విభాగం జనరల్ ఫోర్ మెన్ అండిబోయిన అప్పారావుకు పవర్ లిఫ్టింగ్ 93 కిలోల విభాగంలో మాస్టర్ టు కేటగిరీలో గోల్డ్ మెడల్ సాధించారు.

గుంటూరును కలిసిన సత్తివానిపాలెం నాయకులు

ప్రజాశక్తి- పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసిపి రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విశాఖపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు వెంకట నరసింహారావును పెందుర్తి మండలం సత్తివానిపాలెం గ్రామానికి చెందిన పలువురు నాయకులు కలిసి మద్దతు పలికారు. శనివారం ఉదయం సరిపల్లిలోని నరసింహారావు ఇంటికి వచ్చిన బోడసింగి శ్రీకాంత్, పాండ్రంగి రమణ, పాండ్రంగి శంకర్రావు, సతివాడ గంగునాయుడు, చడగం సంతోష్ తదితరులు ఆయనతో చర్చలు జరిపారు. గతంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సత్తివానిపాలెం గ్రామానికి నరసింహారావు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. వైసిపి నుంచి సీటు కోసం గట్టిగా ప్రయత్నించాలని నరసింహారావుకు వారు సూచించారు. వైఎస్ కుటుంబం అడుగుజాడల్లో నడుస్తున్న నరసింహారావుకు న్యాయం జరగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

జంక్ ఫుడ్స్‌తో అనారోగ్యం

కిమ్స్ ఐకాన్ డాక్టర్ ఆర్‌వి.రవికన్న



ప్రజాశక్తి -గాజువాక : జంక్ ఫుడ్ ఆరోగ్యాన్ని పాడు చేస్తాయని శీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్ డాక్టర్ ఆర్‌వి రవికన్నా తెలిపారు. జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం అనారోగ్యకరమైన ఆహారపు అలవాటు అన్నారు. ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతున్నాయని తెలిపారు. కమ్యూనిటీలలో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలని వివరించారు. వస్తువులను శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం అన్నారు. చేతులు సరిగ్గా కడుక్కోవడం, మంచి పారిశుధ్య పద్ధతులు పాటించడం వల్ల వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉంటాయని తెలిపారు. ఈ సాధారణ చర్యలు ప్రజారోగ్యాన్ని రక్షించడంలో పెద్ద మార్పును కలిగిస్తాయన్నారు. ఆరోగ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కూడా చాలా ముఖ్యమని తెలిపారు.

ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన గాలి, నీరు, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని కలిగి ఉన్న భవిష్యత్తు కోసం కలిసి పనిచేయాలని కోరారు. .

ఎన్నికల ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెంబర్లు

ప్రజాశక్తి-పాడేరు: రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులకు ప్రస్తుతం ఉన్న 1950 టోల్ ఫ్రీ నంబరుతో పాటు మరో మూడు ల్యాండ్ లైన్ నంబర్లను అదనంగా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన, బహుమతులు, నగదు పంపిణీ, అక్రమ తరలింపు, మత్తు పదార్థాల పంపిణీ, తరలింపు, తదితర ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ప్రజలు ఈ దిగువ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ వివరించారు. ఫిర్యాదుల పర్యవేక్షణకు ఫోన్:08935 –299912, 08935 –299934, 08935 –293448 నంబర్లు 24 గంటలూ అందుబాటులో ఉంటాయన్నారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు

ప్రజాశక్తి -పాడేరు: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేసారు. శనివారం అల్లూరి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో అమరావతి ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుండి ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం రవాణాపై పత్యేక దృష్టి పెట్టి సీజ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న వాలంటీర్ల సంఖ్య, వాలంటీర్ల రాజీనామాలు, తొలగింపులపై ఆరా తీసారు. జిల్లాలో ఎన్నికల పరిశీలకులు త్వరలో పర్యటిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, డిఆర్ఓ పద్మావతి, ఎన్డీసి పి. అంబేద్కర్, నోడల్ అధికారి సువర్ణ ఫణి పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట భద్రత

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సమస్యాత్మక గిరిజన ప్రాంతాల్లో స్పెషల్ పార్టీతో కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. వాహనాలపై ప్రయాణించేవారు జాగ్రత్తలు పాటించాలన్నారు. యువతకు వాలీబాల్ కిట్లు పంపిణి, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఏయూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ప్రతిభావంతులైన ఏయూ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో న్యూట్రికో సౌత్ ఏషియా సంస్థ ఎమ్‌డి డాక్టర్ సౌరభ్‌శేఖర్ నేతృత్వంలోని సంస్థ ప్రతినిధులు ఏయూ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూతో అవగాహన ఒప్పందం చేసుకోవడం, ఏయూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పన దిశగా ప్రాథమికంగా చర్చించారు. ఈ సందర్భంగా ఏయూ తరపున సౌరభ్ శేఖర్ తదితరులను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఎంఎల్ఆర్ విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, విభాగ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.